ఐల్ ఐ కింగర్

# చింపబడిన ఆజ్ఞాపత్రం

చాలాకాలంగా, సైనికాధికార కేంద్రం నించి ఆజ్ఞలేమీ లేవు. బహుశా తమ దళం శీతాకాలమంతా ఇక్కడే గడపాలేమో. చుట్టుప్రక్కల అడివి దారుల్లో, రేగుపొదలనించి అఖరిపళ్ళు రాలి, కింది చెత్తలో పడి కుళ్ళిపోతున్నాయి. చిటారు కొమ్మలనంటి పెట్టుకుని కొందరు గస్తీ సైనికులు దిగులుగా, ముందుకి చూపులు సారించి నీడలు చిక్కబడ్డం గమనిస్తున్నారు. శత్రువులు నది అవత లున్నారు. దాడికి సన్నాహాలేమీ వాళ్లు చేస్తున్నట్టు లేదు. మరి రోజురోజూ నీడలు పొడుగౌతున్నాయి. ప్రతి ఉదయం పల్లాల్లోనుంచి పొగమంచు మరీ చిక్కగా పైకి లేస్తోంది. ఈ రక్షకదళంలో కొందరు కుర్రకారు వాలంటీర్లకు, కదలికలేని పగలూ, రాత్రీ చూసి చూసి విసుగెత్తిపోయింది. ఇలాంటి 'యుద్ధా'నికి వాళ్ళు తట్టుకోలేకపోతున్నారు. దూదిమంచు ఆరంభం కాకముందే – ఆజ్ఞలు వచ్చినా రాకపోయినా – తమంతట తామే దాడి జరపడానికి నిశ్చయించుకున్నారు.

అంచేత, దళాధిపతులు ఒక ఉత్తరం అతని చేతికిచ్చి అధికార కేంద్రానికి వెళ్లమనే సరికి అతని గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఏ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా, అధికారులు తిరుగుబాటనేసరికి, తీవ్రమైన చర్యలే తీసుకుంటారు, ఉత్తరం కేంద్రాధికారుల కందజెయ్యగానే, వారు కొన్ని ప్రశ్నలు వేశారు. ఏదో ముద్దాయిని వారు పరీక్షిస్తున్నట్టనిపించి అతను మరింత కంగారుపడ్డాడు.

ఎంతోసేపు వేచి ఉన్నాక, అధికారులు ఒక సీలువేసిన ఉత్తరం అతనిచేతికిచ్చి, చీకటి పడేలోగా రక్షకదళానికి అందజెయ్యమన్నారు. అతనికి మరీ ఆశ్చర్యం కలిగింది. అడ్డదారిన వెళ్ళమన్నారతన్ని. శత్రు తుపాకులు దారిలో ఎక్కడెక్కడ గురిపెట్టబడ్డాయో, ఒక పటం తెరిచి అతనికి చూపించారు. అతని కిష్టం లేకపోయినా, అతనికొక సైనికుణ్ణి తోడిచ్చారు. అతను వెళ్ళవలసిన దారి, తెరచిఉన్న కిటికీలోంచి కనబడుతోంది. తోపు మధ్యనుంచి అడ్డంగా సాగి పొదలమాటుకి ఆడుతూ పాడుతూ పోయింది దారి. జాగ్రత్త పడకపోతే ప్రమాదమని నిర్ణయించుకున్నా డతను. వెంటనే బయలుదేరాడు అనుచరుడితో.

మధ్యాహ్నం కొంచెం దాటింది. మబ్బులనీడలు, మేస్తున్న దూడల్లాగ పచ్చికమీదినించి నడిచి, గుబురులలో కలిసిపోతున్నాయి. దారి పొడుగ్గా ఉంది. ఒక్కొక్క చోట దాటడమే కష్టం. కురుచపొదలు వాళ్లమీద మూసుకుపోతున్నాయి. డ్రైవరు కాస్త వేగం హెచ్చించేసరికి, రెమ్మలు కళ్లమీద చెళ్ళుమని తగులుతున్నాయి. కొట్టె వాళ్ళకోసం కనిపెట్టుకున్నట్టుంది అడివి. చెట్ల సందుల్లో నించి కిందుగా అక్కడక్కడ కనిపిస్తున్న నదికూడా, తనకేమీ తెలియనట్టు సాగిపోతోంది. గుట్టలమీద కోసిపెట్టిన కలప మధ్యాహ్నపు టెండలో మెరుస్తోంది. ప్రకృతిలో ఏదీకూడా సరిహద్దుల్ని గుర్తించినట్టే కనబడదు.

చెట్ల మొదళ్ళ మధ్యనించీ ఎప్పటికప్పుడు తెరుచుకుంటోంది అడివిదారి. అది తొందరగా దాటి బయటపడాలని వాళ్ళ ఆత్రం. దారి, అడివి గుండెలోకి చూడ్డానికి అవకాశమిస్తోంది. అయితే వాళ్ళని శత్రువులు చూడ్డానికి కూడా అవకాశమిస్తోంది. నేలమీద పరుచుకున్న చెట్ల వేళ్ళమీద, జీప్‌ని గంతు వేయిస్తూ, డ్రైవర్ ఆజ్ఞాపత్రం తీసుకొస్తున్న అతనివంక అప్పుడప్పుడు తిరిగి చూస్తున్నాడు, ఉన్నాడని నిర్ధారణ చేసుకోడానికిలాగ. ఈ చూపులతనికి చిరాకు పుట్టించాయి. పై అధికారులతన్ని నమ్మడంలేదని అతనికి గట్టినమ్మకం కలిగింది.

ఆజ్ఞాపత్రంలో ఏముంది? ముందున్న గస్తీదళం ఆ ఉదయం నది అవతల శత్రుసైన్యంలో ఏదో కదలికను చూసినట్టు ఒక పుకారు. ఇలాంటి గాలివార్తలు తరచు వస్తూనే ఉన్నాయి. సైనికుల్ని అదుపాజ్ఞలలో ఉంచడానికి అధికారులే ఈ పుకార్లు పుట్టించి ఉండొచ్చు. తనచేత ఉత్తరం పంపించడంకూడా వట్టి గమ్మత్తే కావచ్చు. తనమీద చూపిన నమ్మకం నటన కావచ్చు. అయితే ఎదురు చూడని వార్తలేమన్నా అధికారులకు తను అందించిన ఉత్తరంలో ఉంటే, ఆ విషయం ఆజ్ఞాపత్రంవల్ల తప్పక వెల్లడి అవుతుంది. శత్రువుల గస్తీ దళాలు ఆ దారిని పరిశీలిస్తూనే ఉంటాయి. ఆజ్ఞాపత్రంలో ఏముందీ తెలుసుకుంటే బాగుండుననిపించిందతనికి. ఒకవేళ అధికారుల యెదుట తన నడతను సమర్థించుకోవలసిన అగత్యమే వస్తే, ఇటువంటి సాకు యేదో చెప్పవచ్చునని తీర్మానించుకున్నాడు. ఉత్తరంకోసం జేబులో తడిమాడు. సీలు చేతికి తగిలింది. ఉత్తరం చించి చదవాలన్న ఆత్రం, చీకటిపడుతున్నకొద్దీ, చలిజ్వరంలా పెరిగింది.

కాస్త ఆలోచించుకోడానికి, తన సహచరుణ్ణి తనతో చోట్లు మార్చుకోమన్నాడు. తను జీప్ నడపడం మొదలెట్టాక అతని ఆందోళన కాస్త తగ్గింది. అడివి దాటేసరికి యుగాలు గడిచినట్టనిపించింది. తాత్కాలికంగా కట్టిన అడ్డు గోడలు శిథిలమై దారి అంతా రాయీరప్పాతో నిండిపోయింది. ఇంక చేరవలసిన చోటు దగ్గరపడుతోంది. అతని ఆందోళన మరికాస్త తగ్గింది. శిబిరం చేరుకుంటే, ఆజ్ఞాపత్రం చింపడానికి అవకాశమే ఉండదని ఆశపడ్డాడు. ప్రశాంతంగా, ధీమాతో జీప్ నడుపుతున్నాడు. దారి అకస్మాత్తుగా పిచ్చిగా, మృత్యుముఖంలోకి దిగినట్టు పల్లంలోకి వంకరగా తిరిగినచోట, ఏ ప్రమాదం లేకుండా దాటేశాడు. కాని వెంటనే ఒక బురదప్రదేశంలో జీప్ చిక్కుపడి ముందుకి కదలలేదు. ఇంజన్‌కూడా ఆగిపోయింది. పిట్టల అరుపులు నిశ్శబ్దాన్ని మరింత చిక్కబరుస్తున్నాయి. సరుగుడుచెట్లు చుట్టూ ఏపుగా దట్టంగా పెరిగాయి; జీప్‌ని ఇవతలికి లాగారు. సహచరుడు ఇంజన్‌లో ఏం చెడిపోయిందో చూడ్డానికి జీప్ కిందకి దూరాడు. అతను ఆజ్ఞాపత్రం సీలు ఊడదీశాడు. సీలు విరిగిపోకుండా అతను జాగ్రత్తన్నా పడలేదు. జీప్‌మీద వంగి ఆజ్ఞాపత్రం చదివాడు. అతన్ని కాల్చెయ్యాలని ఉంది అందులో.

జీప్ కిందనుంచి సహచరుడు తల ఇవతలికి తీసేలోగా, ఆజ్ఞాపత్రం జేబులోకి తోసేశాడతను. "అంతా సరిగ్గానే ఉంది" అన్నాడు సహచరుడు సంతోషంగా. తను నడపనా అని అడిగాడు. సరే నన్నాడతను. ముందు ఇనప వూచపెట్టి ఇంజన్ తిప్పుతూ, తన సహచరుణ్ణి ఇప్పుడు చంపడమా, జీపు నడుపుతుండగా చంపడమా అని తర్కించాడు. తానిప్పుడు సైనిక నిర్బంధంలో ఉన్నాడని అతనికి గట్టి నమ్మకం.

దారి, పల్లపులోతుకి దిగగానే చటుకుని వెడల్పయింది. ఏటవాలులో అంత ఇరుకుగా ఉన్నందుకు సిగ్గుపడినట్టు. మళ్ళీ ఎత్తుకి ఎక్కడం ప్రారంభించింది, మెల్లగా. "ఆత్మహత్య చేసుకున్న ఆత్మను, దేవతలు మెల్లగా పైకి మోసుకుపోతున్నారు." అనుకున్నాడు అతడు. కాని ఇప్పుడతన్ని మోసుకుపోతున్నది సైనిక న్యాయస్థానానికి, అక్కడ చట్టబద్ధమైన తన నడవడిక ఘోర నేరమైపోతుంది. ఆజ్ఞ లేకుండా ఏది చేసినా నేరమే. తన విషయంలో వాళ్ళింత శ్రమ ఎందుకు పడుతున్నారో అతనికి అర్థం కాలేదు.

చీకటిపడ్డకొద్దీ, తనముందు పేరుకున్న నీడలా డ్రైవర్ ఆకారపు అంచు కనిపిస్తోంది. అతని శిరస్సు, భుజాలు, చేతులకదలిక. అతని చూపుకి అందకుండా మరుగుపడ్డ మిగిలిన ఆకారంయొక్క పైఅంచు, అలవాటైన అంచులు చీకటిలో కరిగిపోతాయి.

డ్రైవర్ అతనివంక తిరిగి, "ఈ రాత్రి ప్రశాంతంగానే ఉండేటట్టుంది," అన్నాడు. అది కల్తీలేని వెటకారంలా వినిపించిం దతనికి, గమ్యస్థానం దగ్గర పడుతున్నకొద్దీ, డ్రైవర్ పెదవులు మరింత విడివడ్డాయి. సమాధానంకోసం ఎదురుచూడకుండా, మాట్లాడుతూనే ఉన్నాడు. "మనం సురక్షితంగా చేరుకోగలిగితే..." అతడు రివాల్వర్ తీశాడు, తన బెల్ట్‌లోంచి. అడివిలో చీకటి చిక్కగా ఉంది, అప్పుడే రాత్రి పడినట్టు అనిపించింది. "నా చిన్నతనంలో సాయంకాలం బడినించి ఇంటికి ఒక అడవిలోంచి పోవలసివచ్చేది. అప్పుడు గొంతెత్తి పాడుతూ పోయేవాడిని," అన్నాడు డ్రైవర్.

అనుకోకుండా చటుక్కున అడివిలో ఆఖరి మలుపు వచ్చేసింది. ఇది గనక దాటామా - అనుకున్నాడతను. ఎందుకంటే అక్కడ అడివి మరీ దట్టంగా ఉంది. అది దాటగానే దారి ఆ కాలిపోయిన పల్లెలోకి తెరుచుకుంటుంది. ఆ పల్లె తన సైనికదళానికి ఆవాసం. ఇక్కడ తోవ కాస్త వెడల్పుగా ఉంది, గడిచిన అడవి దార్లకన్నా. నది, దారికి మరీ దగ్గరగా మెరుస్తోంది. ఆ కొండ కొమ్మల మీదికి ఎక్కేదాకా దారిమీద అంతటా వెన్నెల, సాలిగూడులా పరుచుకుంది. ఎద్దుబళ్ళు వెనకెప్పుడో ఆ దారిని వెళ్ళేవి, అంచేత దార్లో లోతైన గాళ్ళు పడ్డాయి. వెన్నెల మూలంగా, ఎండిన ఆ గాళ్ళు, మృత్యువు వేసుకొన్న ముసుగులోపలి వైపులా అగుపించాయి. తోపు నడుమనించి, అతను క్రిందికి నది వంక చూశాడు. భూమి మీద పరాయి ముద్ర ఏదో పడ్డట్టు తోచిందతనికి.

అతను రివాల్వర్ మోకాలిమీద ఆన్చి ముందుకి గురిపెట్టి పట్టుకున్నాడు. అంచేత మొదటి ప్రేలుడు చెవిని పడగానే, తొందరపడి తనే ముందుగా అనుకోకుండా పేల్చాననుకున్నా డతను. కాని, ముందు మనిషికి గుండు తగిలిఉంటే, అతని ప్రేతానికి మంచి స్థైర్యం ఉండి ఉండాలి. మరికాస్త వేగంగా జీప్ నడుపుతోంది ఆ ప్రేతం. దెబ్బతగిలింది. తనకని అతడు గుర్తించడానికి చాలాసేపు పట్టింది. రివాల్వర్ చేతిలోంచి జారిపోయింది. కలువకాడల్లా వాలిపోయాయి చేతులు. మళ్ళీ చెట్ల గుబురుల్లోకి జీప్ పోయేలోగా ఎన్నో తుపాకి గుండ్లు పేలాయి. అయితే గురి తప్పాయి.

ముందున్న ప్రేతం నవ్వుతూ ముఖం వెనక్కు త్రిప్పి, "అమ్మయ్య, ఆ గండం గడిచింది. ఆ కాళీప్రదేశానికి గురిపెట్టి ఉన్నాయి శత్రువుల తుపాకులు," అంది.

"ఆపు," అన్నాడతను.

"ఇక్కడకాదు, కాస్త అడివిలోకి పోయాక," అన్నాడు సహచరుడు.

"గుండు తగిలింది నాకు," అన్నాడతను బాధగా.

సహచరుడు వెనక్కి తిరిగి చూడకుండా మరికొంతదూరం జీప్ నడిపాడు. ఒకచోట చటుకుని ఆపాడు, మొత్తంమీద ఎలాగో రక్తస్రావం ఆపి కట్టుకట్టాడు. అప్పుడనగలిగాడు అతనికి తోచిన ఓదార్పుమాటలు.

"ఇంక వొచ్చేశాంలే."

దెబ్బతిన్న సైనికుడికి చావుతథ్యం – అనుకున్నా డతను.

"ఆగు," అన్నాడతను.

"ఏమిటింకా?" అన్నాడు సహచరుడు చిరాకుగా.

"ఆజ్ఞాపత్రం" అన్నాడతను. ఎడం చేత్తో జేబు తడిమాడు. ఆ నిస్పృహలో అతనికొక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆజ్ఞాపత్రంలో మాటలకు మరో అర్థం ఉంది. తీసుకువచ్చినవాణ్ణి చంపమని ఉంది అందులో. కాని పేరు మాత్రం లేదు.

"నా కోటంతా రక్తంతో తడిసిపోయింది. ఆజ్ఞాపత్రం నీదగ్గరుంచు జాగ్రత్తగా" అన్నాడతను.

సహచరుడు పత్రాన్ని తీసుకోడానికి నిరాకరిస్తే, విషయం అక్కడే తేలిపోతుంది. ఒక క్షణం మౌనం. ఆ తరవాత ఎవరో తనచేతిలోంచి పత్రం తీసుకున్నారు.

"అంతా సరిగ్గానే ఉంది," అన్నాడు సహచరుడు.

ఆఖరు అరగంట నిశ్శబ్దంగా గడిచిపోయింది. కాలం, దారి, పెద్దపులుల్లా ఒకదాన్ని ఒకటి చీల్చుకుంటున్నాయి. ఆ లోకపు పొలిమేరల్లో పచ్చిక బయళ్ళమీద గొర్రెలు సురక్షితంగా మెయ్యవచ్చు. కాని ఆ లోకపు పొలిమేరలు, వధ్యస్థలంగా మారిపోతాయి.

సైనికదళం ఆవాసంగా చేసుకున్న ప్రదేశం, ఐదు ఇళ్ళ చిన్ని గూడెం. వెనక జరిగిన పోరాటంలో అందులో మూడిళ్ళు కాలిపోయాయి. పడిపోగా మిగిలిన ఇళ్ళు వెలుగులో మెరుస్తూ నిలబడి ఉన్నాయి. అంటే ఇంకా సంధ్యా సమయం దాటి రాత్రి రాలేదన్నమాట. ఆ గూడానికి అన్ని ప్రక్కలా అడివి మూసుకుపోయింది. పచ్చికబళ్ళ రాకపోకలతో నలిగి చెదిరిపోయింది. శిబిరానికీ అడివికీ మధ్య ముళ్ళ తీగలతో కంచెకట్టారు.

పహరాభటుడు ప్రశ్నించగా, డ్రైవర్ : "ఒక చావుదెబ్బతిన్న సైనికుణ్ణీ, ఒక ఆజ్ఞాపత్రాన్నీ తెచ్చాను" అని చెప్పాడు. గూడెం నడివీథిని చుట్టి వెళ్ళారు వాళ్ళు. జీప్‌లో అతను లేచి కూర్చోడానికి ప్రయత్నిస్తూ అనుకున్నాడు – లోకంలో ఎన్నో చోట్లుండగా ప్రత్యేకంగా ఇదే చేరుకోవలసినచోటు ఎలాగయింది? అన్నీ విడిచిపెట్టిపోవలసిన చోట్లంటే ఇంకా కొంత అర్థముంది. ఒకగొంతు "తెలివిగా ఉన్నాడా?" అని అడిగింది. అతను కళ్ళు మూసుకున్నాడు. కొంచెం వ్యవధి చేజిక్కించుకోడం అవసరం.

తను నేరం ఒప్పుకోవలసిన సమయం రాకుండానే బలం చేకూర్చుకుంటాడు, పలాయనానికి పనిముట్లు సేకరించుకుంటాడు, వాళ్ళు జీప్‌లోంచి అతన్ని మోస్తున్నప్పుడు వాళ్ళ చేతుల్లో నిర్జీవంగా వేళ్లాడాడు.

ముందున్న కాళీప్రదేశం దాటి, అతన్ని నుయ్యి ఉన్న ఇంట్లోకి మోసుకుపోయారు. రెండు కుక్కలు ముక్కులతో తడుముకుంటూ ముందరకొచ్చాయి. అతని గాయం బాధపెడుతోంది. క్రింద గదిలో ఒక బల్లమీద అతన్ని పడుకోబెట్టారు, దీపాలేవీ వెలిగించలేదు. కిటికీలన్నీ తెరిచే ఉన్నాయి.

"ఇతన్ని జాగ్రత్తగా చూడండి, నేను వెంటనే వెళ్ళిపోవాలి," అన్నాడు డ్రైవర్.

తన గాయం కడిగి కట్టు కడతారనుకున్నాడతను. కాని మెల్లగా కళ్ళు తెరిచి చూస్తే గదిలో తనొక్కడే. బహుశా మందులూ మాకులూ తేవడానికి వెళ్ళారేమో. ఇంట్లో రాకపోకల చప్పుళ్ళు చకచకసాగాయి. తలుపులు దభేలు మన్నాయి. గొంతుకలు ప్రతిధ్వనించాయి. అయితే ఈ గడబిడకు మధ్య ఎక్కడో మౌనం ఉంది. అడివిలో పక్షుల కలకలంలాగే, ఈ చప్పుళ్ళు తమలోపలి నిశ్శబ్దాన్ని బలపరుస్తున్నాయి. "ఏమిటీ గొడవంతా?" అనుకున్నాడతను. కొంతసేపు ఎవరూ కనబడకపోయేసరికి, తక్షణం పారిపోవడానికి అవకాశాల్ని అంచనా వేసుకున్నాడు. హాలులో తుపాకులు నిలబెట్టి ఉన్నాయి. పహారా భటుడడిగితే, సైనిక కేంద్రానికి తనచేత మరో వర్తమానం పంపిస్తున్నారని చెప్పవచ్చు. అతని కాగితాలన్నీ అతని దగ్గరే ఉన్నాయి. త్వరగా తప్పించుకోగలిగితే, ఎవరికీ ఏ అనుమానమూ తగలదు.

అతను లేచి కూర్చున్నాడు. అతను నటించిన బలహీనత నిజంగా ఎంత ఎక్కువగా ఉందో అతనికి అర్థమయింది. తొందరపడి కాళ్ళు కిందబెట్టి నిలబడ్డానికి ప్రయత్నించాడు. అతనివల్ల కాలేదు. మరోసారి దృఢనిశ్చయంతో ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో డ్రైవర్ తాత్కాలికంగా కట్టినకట్టు ఊడొచ్చింది. గాయం తెరుచుకుంది. దాచిపెట్టిన కోరికలా విరగబడి విచ్చుకుంది, బల్లమీద పడిపోయాడు. రక్తం అతని చొక్కానీ బల్లనీ తడిపింది. వెల్లవేసిన తోట గోడపైన ఆకాశం కనపడింది. కొట్టాల్లోకి తెచ్చిన గుర్రాల డెక్కల చప్పుడు వినబడింది. ఇంట్లో హడావిడి ఎక్కువైంది. అనుకోనిదేదో జరిగినట్టు గొడవ పెద్దగా పెరిగింది. కిటికీ అంచు పట్టుకుని లేవబోయి అతను మళ్ళీ వెనక్కి పడిపోయాడు. అరిచాడు. ఎవరూ విన్నట్టులేదు. వాళ్ళతన్ని గురించి మరిచిపోయారు.

ఆ పడిపోయిన స్థితిలో అతనిలో రేకెత్తిన తిరుగుబాటు తొలిగిపోయి, నిస్పృహ చిందులు తొక్కింది. రక్తస్రావం వల్ల చచ్చిపోవడం, తాళాలువేసిన తలుపుల్లోంచి జారిపోవడం లాంటిది, కాపలా వాళ్ళందర్నీ తప్పించుకుపోవడం వంటిది. ఎదటిగోడమీద ప్రతిఫలించిన వెలుగుతో రప్పూమనే ఆ గది, ఒక విచిత్ర స్థితిలాగ అతనికి అనిపించింది. విసర్జనం అన్నిటికన్నా పరిశుద్ధమైన స్థితికాదూ? ప్రాణరక్తస్రావం చైతన్యం కాదూ? ఆత్మరక్షణకోసం గాక, ఏ కోరికలూ లేకుండా అత నిది కోరుకున్నాడు. అంచేత అతనిమీద అమలు జరుపబడుతున్న శిక్ష న్యాయమైనది. పొలిమేరలో వేచివేచి విసుగెత్తిపోయిన అతనికిది విడుదల.

దూరాన తుపాకులు మోగుతున్నాయి. అతడు కళ్ళు తెరిచి గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆజ్ఞాపత్రం ఇచ్చి వెయ్యడం తెలివిమాలిన పని. తనిక్కడ రక్తస్రావంతో చచ్చిపోతున్నాడు. ఏ నేరం చెయ్యని మరొకణ్ణి అక్కడ కాల్చేస్తున్నారు. అతన్ని కాలిపోయిన కంచెల

మధ్యనుంచి, వధ్యస్థలానికి లాక్కుపోతుంటారు. ఈపాటికి అతని కళ్ళకి గంతలుకూడా కట్టేశారేమో. దిగ్భ్రమతో అతని నోరు మట్టుకు తెరుచుకుని ఉంటుంది. వాళ్లు తుపాకులెత్తారు. గురిచూశారు. జాగ్రత్త...

అతనికి మళ్ళీ తెలివొచ్చేసరికి, అతని గాయాలకి కట్టు కట్టి ఉన్నాయి. రక్తమంతా కారిపోయి చచ్చిపోయిన మనిషికి, దేవతలీ సేవచెయ్యడం శుద్ధ అనవసర మనుకున్నాడతను; ఈ కరుణాకృత్యం తరుణం దాటిపోయాక జరిగింది.

"మళ్ళీ కలుసుకున్నాం మనం," అన్నాడు డ్రైవర్ అతనిమీద వంగి, తన మంచానికి కాళ్ళవేపు సైనికోద్యోగి నిలబడి వుండడం చూసేవరకూ, తను బ్రతికే ఉన్నాడన్న భయంకర సత్యం అతనికి రుజువు కాలేదు.

"ఆజ్ఞాపత్రం... ఆజ్ఞాపత్రం ఏమయింది?" అన్నాడతను.

"గుండు తగిలి చిరిగిపోయింది. కాని చదవడానికి వీలయింది," అన్నాడు ఉద్యోగి.

"అది మీ కందించవలసింది నేను," అన్నాడతను.

"సమయం మించిపోకండానే చేరుకున్నాం," అన్నాడు డ్రైవర్.

"అవతలి గట్టుమీంచి దాడి జోరుగా ప్రారంభమయింది.

"అదేమో ఎదురుచూస్తున్న అంతిమ సందేశం," అని ఉద్యోగి వెళ్ళిపోడానికి వెనక్కి తిరిగాడు. గుమ్మందాకా వెళ్ళి, మళ్ళీ అతనివేపు తిరిగి, ఏదన్నా అనకపోతే బాగుండదన్నట్టు అన్నాడు.

"ఆజ్ఞాపత్రంలో వ్రాసి ఉన్నదేమిటో నీకు తెలియక పోవడం మంచిదే అయింది. దాడి మొదలుపెట్టమని చెప్పడానికి, మాకో విచిత్రమైన సాంకేతిక భాష వుంది."

●